www.freegurukul.org
(Values, Skill Based Education In Digital)
Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators.
We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org
https://t.me/helpfulinfo

# ఇక పీపీపీ తరహా ఆదర్శ పాఠశాలలు

యాజమాన్య కోటా కింద 50 శాతం సీట్లు

కేంద్రీయ విద్యాలయాల మాదిరిగా సీబీఎస్ఈ పాఠ్య ప్రణాళిక

వెనుకబడిన ప్రాంతాల్లోనే కాదు.. ఎక్కడైనా పెట్టుకోవచ్చు

దేశవ్యాప్తంగా 2,500 పాఠశాలల ఏర్పాటుకు కేంద్రం సమాయత్తం

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం(పీపీపీ) విధానంలో ఆదర్శ పాఠశాలలు రానున్నాయి. వీటిల్లో 50 శాతం సీట్లను ప్రభుత్వం గుర్తించిన విద్యార్థులకు కేటాయిస్తారు. మిగిలిన వాటిని పాఠశాలలు నడుపుతున్న ప్రైవేట్ సంస్థలు యాజమాన్య కోటా కింద భర్తీ చేసుకుంటాయి. ఆ సంస్థలే రుసుములను నిర్ణయించుకుంటాయి. వీటిని కేంద్రీయ విద్యాలయాల(కేవీ) మాదిరిగా సీబీఎస్ఈకి అనుబంధంగా 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు నడుపుతారు. దేశవ్యాప్తంగా మొత్తం 2,500 పాఠశాలలను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ మేరకు త్వరలోనే బిడ్లు పిలిచే అవకాశం ఉంది. వెనుకబడిన ప్రాంతాల్లో నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో 2007లో అప్పటి కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 3,500 ఆదర్శ పాఠశాలలను నెలకొల్పింది. ఆ మేరకు తెలంగాణలో 194, ఏపీలో 150కిపైగా పాఠశాలలు ఏర్పాటు చేశారు. రెండో దశ కింద మరో 2,500 పాఠశాలలను పీపీపీ విధానంలో ఏర్పాటు చేయాలన్నది అప్పటి ప్రణాళిక. అయితే అది కార్యరూపం దాల్చలేదు. దాన్ని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కొన్ని నిబంధనలు మార్చి తెరపైకి తీసుకొచ్చింది. రాష్ట్రీయ ఆదర్శ విద్యాలయ అనే పేరుపై వాటిని ఏర్పాటు చేస్తారు. పీపీపీ నుంచి ప్రభుత్వం తప్పుకుంటే ఆ పేరును వినియోగించుకోరాదు.

వీటికి సంబంధించి నిబంధనలు.. ముఖ్య విశేషాలు

* కొత్తగా ఏర్పాటు చేయడంతోపాటు ఇప్పటికే ఉన్న పాఠశాలలనూ ఆదర్శ పాఠశాలలుగా మార్చుకోవచ్చు. కనీసం 3 ఎకరాల స్థలం అవసరం. దాన్ని ఆయాసంస్థలే సేకరించుకోవాలి.

* వెనుకబడిన ప్రాంతాల్లోనే కాకుండా ఇతర పట్టణ ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేయవచ్చు.

* 6-12 తరగతుల వరకు విద్యనందిస్తారు. ఒక్కో తరగతిలో 350 సీట్లు ఉంటాయి. మొత్తం మీద బడిలో 2,500 మంది విద్యార్థులకు మించరాదు.

* ఒక్కో తరగతిలో 50 శాతం మందిని ప్రభుత్వం స్పాన్సర్ చేస్తుంది. 8వ తరగతి వరకు ప్రభుత్వం స్పాన్సర్ చేసిన విద్యార్థులకు ఉచిత విద్య అందించాలి. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఎస్సీ, ఎస్టీ, బాలికలు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి రూ.25లు, మిగిలిన వారికి రూ.50లు ఫీజు వసూలు చేస్తారు.

* యాజమాన్య కోటా కింద సీట్లు పొందిన వారికి రుసుంను యాజమాన్యమే నిర్ణయిస్తుంది.

* ప్రతి ఏటా పాఠశాల నిర్వహణకు అయ్యే రికరింగ్ ఖర్చులో 25 శాతం ప్రభుత్వం భరిస్తుంది. కేంద్రీయ విద్యాలయాల్లో ఒక్కో విద్యార్థికి అయ్యే ఖర్చును పరిగణనలోకి తీసుకొని ఇస్తారు.

* రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో ఒక స్వతంత్ర సంస్థ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులను ఎంపిక చేస్తారు.

* ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తి 1:25గా ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇది 1:40కి మించరాదు.

* ఒక సంస్థ ఒక రాష్ట్రంలో 20, దేశవ్యాప్తంగా 50 పాఠశాలలను మాత్రమే నడుపుకోవచ్చు.